# పిరికి గుండె

పోస్టుమాన్ కవర్ చేతికి ఇవ్వగానే నాకు అనుమానం కలిగింది. కవరు చాలా తేలిగ్గా వుంది. మా మేనత్త నాకు ఎప్పుడు వుత్తరం రాసినా – అదనంగా ఓ అణా చీటీ అంటించకుండా రాయలేదు. కాని యీసారి – ఏదో విశేషం? శుభమా? అశుభమా?

ఆదుర్దాగా కవరు చింపాను. మొదటి పంక్తి చదవగానే కాళ్ళ కింద భూమి పగిలినట్టయింది. ఆమె ఎప్పుడు వుత్తరం రాసినా 'ప్రియమైన చవట వెధవకి' అంటూ ప్రారంభించేది. పొరపాటున ఏ స్నేహితుల కంటనైనా ఈ వుత్తరాలు పడితే, నాకు న్యూనతగా వుంటుంది. పద్ధతి మార్చమని ఎన్నోసార్లు ప్రాధేయపడ్డా! ఆమె ఒకటే జవాబు యిచ్చేది. 'మీ అయ్య పొరపాటున ఆ మంచి పేరు పెట్టాడుగాని – అసలు నీ బుద్ధి బలానికి తగిన పేరు నేను పిలిచేదే' అని.

కాని యీనాటి యీ హఠాత్ పరిణామం?

ఏ పరిస్థితికైనా మనస్సును సిద్ధం చేసుకునేందుకు ఓ సిగరెట్టు ముట్టించి, బాగా గోడకు ఆనుకు కూర్చుని వుత్తరం చదవడం ప్రారంభించాను.

'యిక్కడ అంతా క్షేమం. నీవు సజీవంగానే వున్నావనుకుంటాను. పార్వతి రెండు రోజుల కిందట జుట్టు గొరిగించుకుని, ఆశ్రమంలో చేరింది. నీవు వీలును బట్టి – వెంటనే ఏ బావిలో అన్నా పడి చావడమో – లేక ఏదైనా ప్రయత్నం చేయడమో ఆలోచించుకో!'

గోడ కొంచెం వెనక్కి జరిగింది. నేను తత్తరపాటుతో, భయంతో ముందుకు జరిగాను. యింటికప్పు వేగంగా నా తల'మీదికి దిగివస్తున్నట్టు తోచింది. బయటకు పారిపోయేందుకు లేచి ద్వారం వైపుకు పరిగెత్తాను. కాలికీ, తలకూ ఒకేమారు ఏదో గట్టిగా తాకింది. ముందుకు పడిపోయాను.

తరవాత ఎంతకాలం జరిగిందో నేను చెప్పలేను. వేగంగా గుండె కొట్టుకోవడం మాత్రం నాకు వినబడుతోంది. మెల్లిగా – అతిమెల్లిగా కళ్ళు తెరచాను. యింటికప్పు నా కళ్ళు గమనించగలిగినంతగా కిందకు దిగలేదు. గోడ మాత్రం ఏ కొంచెమో, లెక్క కట్టలేనంతగా వెనక్కి పోయినట్టు కనబడింది.

అప్పటి నా స్థితికి అసలు కారణం ఏమిటో వెంటనే స్ఫురించింది. లేచి కూర్చున్నాను. కాలు విపరీతంగా బాధ పెడుతోంది. పరీక్షించి చూశాను. బొటన వేలు చివరి వేలంత పొట్టిదిగా తరిగి వూరుకుంది. పాదం నిండా రక్తం. చొక్కా విప్పి కాలుకు చుట్టాను.

ఇంత దారుణ పరిస్థితికి కారణమైన వుత్తరాన్ని అందుకుని మరోమారు చదివాను. యీసారి

యింటికప్పు కిందకు దిగడంగాని, గోడ వెనక్కి పోవడంగాని జరగలేదు. కాని గుండె క్రమక్రమంగా గొంతులోకి ఎగపాకుతున్నట్టు తోచింది. బ్రహ్మాండమంత చీకటి అలా మీదకు వంగి నన్ను కప్పేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తోచింది.

నేను చచ్చిపోతున్నానా? లేక పైత్యపు తెరా? లేక రక్తం చూచినందువల్ల వికారం పొందిందా?

కళ్ళు మూసుకుని అలాగే కూర్చున్నాను. పైవేవీ నా దీనావస్థకి కారణం కాదని స్పష్టంగా తెలిసింది. అసలు కారణం మా పార్వతి జుట్టు తీసేసి ఆశ్రమంలో చేరిపోయింది. కాని – కాని యింకా నాకు స్పష్టంగా అర్థంకాని పరమ సత్యం, వెలుగు నాలో ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నై. తిరిగి కళ్ళు మూసుకున్నాను. స్వర్గాన్ని కూడా అంధకారంలో ముంచగలిగినంత గాఢమైన తమస్సులో – ఏదో చిన్న వెలుగు కనబడుతోంది. కళ్ళు యింకా గట్టిగా మూసుకుని దీర్ఘంగా ఆ వెలుగు వైపుకు చూశాను. ఆ వెలుగుకు కాళ్లూ, చేతులూ, ముక్కూ, కళ్ళూ అన్నీ వున్నై. కాని జుట్టు లేదు. నేను కళ్ళు తెరిచాను.

వుత్తరం మరోమారు చదివినప్పుడు నాకు పరిస్థితి పూర్తిగా అర్థమైంది. పార్వతి మరణించలేదు. జుట్టు మాత్రం తీసివేయించి ఆశ్రమంలో చేరింది. ప్రాణం ఒకసారి పోయిన తరవాత తిరిగి రాదేమోగాని – జుట్టు ఎన్నిసార్లు పోయినా తిరిగి వచ్చేదేగదా!

పరిస్థితుల్ని ఓమారు సింహావలోకనం చేశాను.

పార్వతి బతికే వుంది. కనక నేను చచ్చిపోవడంలో అర్థం లేదు. మా మేనత్త బావిలో దూకి చచ్చిపొమ్మని యిచ్చిన సలహాతో పాటు – యింకో మార్గాంతరం కూడా చూపినట్టు తోచింది. వుత్తరం మళ్లీ చదివాను –

'లేక ఏదైనా ప్రయత్నం చేయడమో – '

పరిస్థితి పగటి కలలాగా స్పష్టంగా తెలిసిపోయింది.

ఆ సాయంకాలం రైలుకే యింటికి బయలుదేరాను.

వాకిట్లో నన్ను చూస్తూనే మా మేనత్త భయం నటిస్తూ రెండడుగులు వెనక్కి వేసింది.

"ఎవరివే నువ్వు? చవట వెధవాయివా లేక ఆ వెధవాయి భూతానివా?"

"ఏదీ కాదు. యింటి యజమాన్ని!"

ఆమె నవ్వుతూ దగ్గిరకు వచ్చింది.

"వుద్యోగం పేరుతో అడుక్కు తింటూ దేశాల వెంట తిరిగే నువ్వు, ఈ యింటికి యజమానివెలా అవుతావే? యింతకీ బావిలోపడి చావలేదన్నమాట!"

చొక్కా విప్పి ఆమె చేతికిస్తూ అన్నాను –

"చావను అత్తా! చావను! చావంటే నాకు ఎంత భయమో నీకు తెలుసుగదా? పార్వతిని పెళ్ళిచేసుకుంటాను"

ఆమె ఆశ్చర్యంగా నా వంక చూస్తూ, "రెండు సంవత్సరాల నుంచీ ఆ మాట ఆడిగేందుకు దమ్ములేక వూరుకున్నవాడివి, తీరా ఆమె సన్యాసుల్లో కలిసిపోయింతరవాత నీవు యిప్పుడు

చేసుకునేదేమిటి?"

"ఇన్నాళ్ళు పార్వతిని ఆ మాట అడగలేక పోవడానిక్కారణం ధైర్యం లేకపోవడం కాదు. ఆమె ఎదట వున్నంతసేపూ, నాకేదో తత్తరపాటుగా వుంటుంది. అంతకుముందు, ఎన్నో మాట్లాడాదామను కుంటాను. కాని తీరా ఆమె ఎదట పడేసరికి, గొంతులో ఏదో అడ్డంపడినట్టుగా అవుతుంది"

"సరే! నీవు ఆ గొంతులో అడ్డాన్ని కక్కేసి, తయారై వచ్చేటప్పటికి - అది కాస్తా జుట్టు గొరిగించుకొని మఠంలో చేరిపోయింది. మరి యిప్పుడేం చేస్తాం?"

నేను వూహించిన దానికంటె పరిస్థితి చాలా గడ్డుగా కనబడింది. ఆశ్రమంలో చేరిపోవడమేగాక, జుట్టు కూడా తీయించుకునే పరిస్థితి ఏర్పడిందని...చెప్పడమంటే - అది సామాన్యమైన విషయం కాదు. తిరపతి వెంకటేశ్వర్లుకు వెంట్రుకలిస్తానని మొక్కుకుంటే, చచ్చే మొగుడు బతుకుతాడని తెలిసినా - జుట్టు మీద వుండే మమకారం కొద్దీ, ఆ త్యాగానికి తయారు కాలేక - వైధవ్యాన్ని భరించేందుకు తయారైన యిద్దరు ముగ్గురు స్త్రీలను నేనెరుగుదును.

నా ఆలోచనలకు నన్ను వదిలేసి - అత్త వంటగదిలో చెంబులూ, కంచాలూ సర్దుతోంది. ఆమె వుత్తరం మొదటిసారి చదివినప్పుడు చచ్చిపోయినా ఫర్వాలేదు అన్నంత దిగులూ, విచారమూ నాకు కలిగింది. కాని యిప్పుడు పరిస్థితుల్ని సాకల్యంగా తిరవేసి చూస్తూంటే - అంతా నిమ్మకు నీరెత్తినట్టుగా వుంది.

అసలు నేను పార్వతిని ప్రేమిస్తున్నానా? దగ్గర ప్రశ్నించేవాళ్ళు ఎవరూ లేరుకనక, నన్ను నేనే ప్రశ్నించుకుని జవాబులు తెలుసుకోదలుచుకున్నాను.

ప్రేమిస్తున్నాను!

అందులో ఏమాత్రం అనుమానానికి ఆస్కారం లేదు. ఆమెను తప్ప భార్యగా మరెవ్వరినీ భరించలేను. పార్వతి కాక - 'ఏ జమిందారు కూతురునైనా సరే - ఆఖరికి యం.యల్.ఏ కూతురునైనా సరే నేను ప్రేమించలేను'

ఆమెను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాననేది నాకు దృఢంగా నిశ్చయమైన తరవాత - ఆమెలో ఏ అందాన్ని, ఏ గుణాన్ని...అన్న ప్రశ్న ఎదుర్కొన్నది?

బాలవితంతువన్న జాలి వల్లా? కాదు. బాల వితంతువుల్ని వివాహం చేసుకోవడం ఏ సంఘోద్ధరణ కార్యంగానో గుర్తించేరకం మనిషిని కాను నేను. బాలవితంతువులంటే జాలి కంటే, నాకు అసూయ కలుగుతుంది. స్త్రీలల్లో యింతో అంతో ఆస్థులున్న వాళ్ళు ఎవరైనా వుంటే వాళ్ళే!

ఆమె అందమైన యువతి అనా? ఇది చాలా తేలిగ్గా జవాబు యివ్వదగిన ప్రశ్నగా నాకు కనపడింది. కళ్ళు తెరిచి వున్నప్పటి కంటె, కళ్ళు మూసుకునే నేను పార్వతి అందాన్ని బాగా చూడగలను. అందుకని కళ్ళు మూసుకున్నాను. ఆమె దివ్యసుందర విగ్రహం ప్రత్యక్షమైంది.

అందం అనేక రకాలు. దాన్ని కొలుచుకునే సాధనాలు కూడా ఎవళ్ళ సొంతం వాళ్ళకుంటై. అడుగు బద్దల్లాగా అంగుళాలు మార్కుచేసి బజార్లో అమ్మేది కాదు. పార్వతి అందం నా కండ్లకు అపూర్వంగా కనపడుతోంది. వర్తమానంలో అంత సౌందర్యవతులు వున్నారనిగాని, భావిలో

వుండబోతారనిగాని నాకు అనుమానం లేదు.

కళ్ళు తెరిచాను. ఎదురుగా మా అత్త నుంచుని నవ్వుతోంది.

"ఏరా! ఏమైనా తపస్సు చేస్తున్నావా?"

"తపస్సు కాదు. పార్వతిని ఎందుకు ప్రేమిస్తున్నానో అర్థం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాను"

"నువ్వు బాగా చెడిపోయావురా వెధవా! అసలు ఆడదాన్ని పెళ్ళికి ముందు ఎంత అర్థం చేసుకుంటానికి ప్రయత్నం చేసినా – అర్థం అయినట్టు కనబడుతుందేకాని, అర్థం కాదు. స్త్రీ పురుషుణ్ని గాని – నిజంగా అర్థం చేసుకోవడం – గడియ వేసుకున్న తలుపుల వెనకాలకి వెళ్ళిన తరవాతే ప్రారంభమౌతుంది. ఆడదాన్నిగా నేను చెపుతున్నాను. నా మాట నమ్ము"

"ఇంతకీ యిప్పుడు నన్నేమి చేయమంటావ్"

"ఆ ఏమి చేయడం అనేది నీవే నిర్ణయించుకోవాలి. కాని నేను యిచ్చే సలహా మాత్రం నీవు అనవసరమైన ఆలోచనల్తో ఆ వున్న కాస్త మెదడునీ పాడుచేసుకోవద్దని. నీ బదులు నేను ఆలోచించి చెపుతున్నాను విను. పార్వతి అందమైంది! చదువుకున్నది! దాదాపు పాతిక వేల రూపాయల ఆస్థి కూడా వుంది! నిన్ను ప్రేమించింది!"

ఆమె యీ మాటలు చెప్పి గిరుక్కున వెనక్కి తిరిగి వంటయింట్లోకి వెళ్ళిపోయింది.

నేను అనుసరించాను.

"అదే అనుమానం అత్తా! అదే అనుమానం!"

"ఏదీ"

"నన్ను ప్రేమించిందా...."

ఆమె కళ్ళెర్రచేసి – ఏ మాత్రం హెచ్చరికా లేకుండానే పొయ్యి దగ్గరవున్న తెడ్డు నా మీదకు గిరవాటు వేసింది.

"పోరా చవటవెధవా! ఛీ! నువ్వు వంశానికే అపకీర్తి! నువ్వు ప్రేమిస్తున్నాననుకునే ఆడదానికి ధైర్యంగా ఆ మాట చెప్పి తేల్చుకునేందుకు దమ్ములేక, నా చుట్టూ సలహాల కోసం తిరుగుతున్నావా?"

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నా – నేను మాత్రం నిన్ను ప్రేమించడం లేదని పార్వతి అంటే?" – నా చేతిమీద రెండు నీటి బిందువులు పడినై.

"ఏడవమాకు. ఆ కన్నీళ్ళని మిగుల్చుకెళ్ళి పార్వతి దగ్గిరే పారపొయ్. అప్పటికి కాదంటే గొంతుకోసుకు చావు" – ఆమె ముఖం అటు తిప్పుకున్నది.

నేను స్పష్టంగా చూడలేదుగాని – మొత్తం మీద నవ్వినట్టు కనబడింది.

"అసలు – పార్వతి తనని ప్రేమించడం లేదనే అనుమానం యీ చవటకెందుకొచ్చింది!" – యీ మాటలు అత్త స్వగతం.

కాని నాకు స్పష్టంగానే వినబడినై. అయినా అనుమానం బాధిస్తూనేవుంది .

"గొంతు కోసుకు ఛస్తున్నా చూస్తూ వూరుకుంటే?"

"నీ ఖర్మ కాలి ఆడదాని ప్రకృతిలోనే అంత మార్పువస్తే చావు"

నేను నిరాశతో, నిస్పృహతో తలుపుకు చేరగిలబడి కూర్చున్నాను.

ఆమె క్షణం నా వంక చూసి, "అయినా మీ మామయ్య నా విషయంలో ఏం చేశాడు?" అన్నది.

"ఏం చేశాడు?"

అత్త చటుక్కున లేచి పడకగది వైపుకు బయలుదేరింది.

నాలో వుత్సాహం మిన్ను ముట్టింది. కాలగర్భంలో కలిసిపోయిందనుకున్న అల్లావుద్దీన్ లాంతరు ఆమె తుప్పు దులిపి బయటకు తీయదుగదా?

ఆమె గుడ్డల పెట్టె అడుగు నుంచి ఓ పట్టుగుడ్డ చుట్టివున్న చిన్న వస్తువు బయటకు తీసింది.

నేను రెప్పవేయకుండా చూస్తున్నాను.

"దీన్ని మీ అయ్యకు తప్ప – ఆఖరికి మీ అమ్మక్కూడా చూపించలేదు"

"ఏమిటిది?" – ఆత్రంగా అడిగాను.

"ఒక్కసారే యీ వస్తువు చూశావంటే గుండె పగిలి చస్తావు. నువ్వు అయిదేళ్ళ వాడివిగా వుండగా – మీ అమ్మా అయ్యా నిన్ను నా చేతుల్లో పెట్టి పొయ్యారు. అందుకనే నువ్వు పెళ్ళిచేసుకో కుండా చావడం నాకు యిష్టం లేదు. కళ్ళు మూసుకో – "

అంతా హరిశ్చంద్ర నాటకంలా కనబడింది. పార్వతి సన్యాసుల మఠంలో కలిసిపోయిన మాట – అంతా వట్టిదేనేమో! కళ్ళు మూసుకుని తెరిచేటప్పటికి ఎదురుగా పార్వతి నిలబడదు గదా!

చుట్టూ ఓమారు చూసి కళ్ళు మూసుకున్నాను. కొద్దిసేపటికి గొంతు మీద ఏదో చల్లగా తగిలింది. కళ్ళు తెరిచాను.

అత్త చేతులో ఓ అడుగు పొడుగు తుప్పు పట్టిన కత్తి వుంది.

"యీ తుప్పు పట్టిన కత్తి ఎక్కడిది?"

"అవును తుప్పు పట్టింది! మీ మామయ్య తరవాత దీన్ని వుపయోగించిన వాళ్ళెవరూ లేరు" – ఆమె నేత్రాలు కాంతి హీనం అయినై. పెదిమలు వణికినై.

"నేను వుపయోగిస్తాను. నాకు ఇవ్వు" – చేయి చాచాను.

ఆమె మాట్లాడకుండా చేతిలో కత్తినీ, దానికి చుట్టివున్న పట్టుగుడ్డనీ ఇచ్చింది.

"మామయ్య దీనితో ఏం చేశాడు?"

"ఏం చేశాడు?" – తిరిగి నన్ను ప్రశ్నిస్తున్నట్టు నా వంక చూసింది – "నా కోసం గుండెల్లో గుచ్చుకునేందుకు తయారయాడు. గొంతులో ఓమారు పొడుచుకున్నాడు"

పమిటచెంగు కళ్ళకి అడ్డం పెట్టుకుని తొందరగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

కత్తి తీసుకుని గదిలోకి వెళ్ళాను. ఆ తుప్పు పట్టిన ఆ పాత యినప ముక్క నాలో అనేక భావాలను రేకెత్తించింది. మామయ్య జీవితాన్ని రసమయం చేసిన యీ అమూల్య వస్తువు, నా

బతుకును మాత్రం బంగారంగా ఎందుకు మార్చదు? అయినా మామయ్యలాగా, నేనూ అవసరమైతే పార్వతి కోసం దీన్ని గొంతులో గుచ్చుకోవడానికి తయారు కాగలనా?

జీవితాన్ని ఎంత గాఢంగా నేను ప్రేమిస్తున్నాను! జీవితాన్నో పార్వతినో - ఏదో ఒకటి కోరుకోమని యముడు నాకు అవకాశం యిస్తే - నేను జీవితాన్నే కోరుకుంటాను. అనుమానం లేదు.

ప్రపంచం అసలు మామయ్య రోజుల్లోనే చాలా మారింది. మామయ్య తరవాత యింకా మారింది. ప్రేమ కోసం ప్రాణాలు వదిలే వాళ్ళకి ప్రజల్లో పలుకుబడిగాని, గౌరవంగాని లేకుండా పోయింది. రోమియో, మజ్నూ, దేవదాసులు - ఈ పంధొమ్మిది వందల నలభై తొమ్మిదిలో, వాళ్ళ జీవితాన్ని ఆ విధంగానే అంతం చేసుకుని వున్నట్టయితే, పత్రికలు ఎక్కడో అడుగున ఆ వార్తలు ప్రకటించేవి. ప్రజలు 'పిచ్చి వెధవలు!' అనుకునే వాళ్ళు. యిది ఆదర్శాల యుగం. ప్రేమ కోసం తప్ప మరి దేనికోసం అయినాసరే చచ్చేవాణ్ని లోకం గౌరవిస్తుంది. ఆఖరికి చలిజ్వరంతో ప్రాణాలు వదిలినా!

కాని పార్వతి నా ప్రేమను తిరస్కరిస్తే? అలా జరిగినా చావను. బతిమాలుతాను, ప్రాధేయ పడతాను, చస్తానని చెపుతాను - అంతే! కాని చావను. నేను ఎంతగా ప్రేమిస్తున్నా, తిరిగి నన్ను ప్రేమించని స్త్రీ కోసం, నేను చావడంలో అర్థం ఏముంది? నన్ను ప్రేమించని వాళ్ళ కోసం, గౌరవించని వాళ్ళ కోసం నేను చావదలుచుకుంటే - పార్వతి కోసమే ఎందుకు చావాలి? యింటి పక్కన వున్న వృద్ధ వితంతువు వెంకాయమ్మ కోసం ఎందుకు చావకూడదు?

కత్తి చేతిలో నుంచి జారి కింద పడింది. తిరిగి చేతికి తీసుకున్నాను.

అసలు మామయ్య నాలాంటి వాడేనేమో? అత్తను భయపెట్టడానికి ఏదో కొంత నాటకం ఆడాడేమో? అంతగా చావాలనుకున్నవాడు, ముందుగానే గుండెల్లో పొడుచుకోక, గొంతు మీద ఎందుకు గుచ్చుకోవాలి!

నాకు ఏదో పరమసత్యం - కవులకూ, మానసిక శాస్త్రవేత్తలకూ తెలియని నగ్నసత్యం అంతు తెలిసినట్టయింది. కాని అది కొంత కటువుగానే వుంది. నగ్నదేహం లాగానే, నగ్నసత్యం కూడా ప్రథమంగా చూసినప్పుడు కొంత జుగుప్సను కలిగిస్తుంది. అంతమాత్రాన అది నగ్నదేహం, నగ్నసత్యం కాకుండా పోవు. స్త్రీ ప్రేమను పొందడానికి కొంత అట్టహాసం, కొద్దిగా మోసం వుపయోగించక తప్పదు. ఏ కాలంలో అయినా ధర్మరాజులకు వివాహాలు కావు. అర్జునుల్లాంటి తమ్ములుండి, మత్స్యయంత్రాలను ఛేదించితే తప్ప!

శాండ్ పేపరుతో కత్తి తుప్పును వదిలించాను. అవసరమైతే పార్వతి హృదయాన్ని నా వైపుకు తిప్పుకునేందుకు దీన్ని వుపయోగిస్తాను. జాగర్తగా, అతి జాగర్తగా - చాలా స్వల్ప మోతాదులో, ప్రయత్నంలో తీరా కార్యం నెరవేరిన తరవాత - తుప్పు వంట్లో ప్రవేశించి సెప్టిక్ అయి చావడం నా కిష్టం లేదు. చలిజ్వరానిక్కూడా ధారాళంగా పెన్సిలిన్ వాడే డాక్టరు వూళ్ళో వున్నా, నేను రిస్కుచేసే మనిషిని కాదు.

నేను పార్వతి కోసం ఆశ్రమానికి వెళ్తున్నానని చెప్పినపుడు అత్త చాలా ఉదాసీనంగా, "వెళ్ళిరా నాయనా!" అన్నది.

ఆమె కంఠస్వరంలోని తేడా, పిలుపులోని మార్పు గమనించాను. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు కనబడింది. నన్ను గురించా? లేక మామయ్య గుర్తుకొచ్చాడా?

అతి స్వల్పకాలంలో నాలుగు మైళ్ళు నడిచేశాను.

విషయానంద స్వామి మఠానికి ముందున్న ఓ వేపచెట్టు కింద కూర్చుని ధ్యానముద్రలో వున్నాడు. ఒక కొబ్బరికాయ, అరడజను చక్రకేళీలు, ఖర్జూరకాయలు ఆయన పాదాల దగ్గిరపెట్టి - వంగి నమస్కరించాను.

ఆయన కళ్ళు మూసుకునే వుండి దీవించాడు.

చుట్టూ చూశాను. ఆశ్రమం చాలా చిన్నది. రెండు పూరిపాకలు, ఓ చిన్న పెంకుటిల్లు అంతే! ఆ వూరి పాకల వైపుకు నడిచాను.

"ఎవరికోసం వచ్చారు?" - వాకిట్లోకి వెళ్ళగానే, లోపల కూర్చుని రాసుకుంటున్న ఓ వృద్ధుడు ప్రశ్నించాడు.

"పార్వతి కోసం"

"ఆ పేరుగలవాళ్ళు ఎవరూ ఇక్కడ లేరే!" - వృద్ధుడు అనుమానంగా నావంక చూశాడు.

"వుందనే వచ్చాను. ఆమె నా బంధువు. నాలుగు రోజులనాడు యిక్కడ చేరింది"

"ఓహో! పవిత్రమ్మగారా! ఆ పక్క యింట్లో వుంది. వెళ్ళండి" - వృద్ధుడు చేయి వూపాడు.

ముందు పిలవకుండానే ఆ పక్క యింటి తలుపు తట్టాను. తిరిగి నాలుగు రోజుల నాడు జరిగిపోయిన అనుభవం సంప్రాప్తించేట్టుగా కనబడింది. కాళ్ళ కింద భూమి కదులుతున్నట్టు తోచింది.

పార్వతి సైను పంచను బాగా కళ్ళమీది వరకూ లాక్కుని లేచి భయపడుతూ నుంచున్నది.

నేను నిశ్చేష్టుణ్నయాను. గుండె గొంతులోకి ఎగబాకుతున్నట్టయింది. అలాగే చూస్తూ నిలబడ్డాను.

ఆమె పలకరించింది.

"ఎప్పుడొచ్చారు...అసలు...అఁ! యిక్కడి కెందుకొచ్చారు?"

ఆమె దగ్గర ఎలా ప్రవర్తించాలో - రిహార్సల్సు చేసుకుని వచ్చిన, నా తలపులూ, భావాలూ అన్నీ గాలికి కొట్టుకుపోయినై. నాకు ఆ సమయంలో పార్వతి తప్ప తక్కిన ప్రపంచం గుర్తులేకుండా పోయింది.

"నీ కోసం - నీ ప్రేమ కోసం - వివాహం చేసుకుంటాను. లేకపోతే చస్తాను"

నేను కిందపడిపోతున్నట్టు - కాని నిలబడేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు నాకు తెలుస్తూనే వుంది. పార్వతి ఏదో జవాబులు చెపుతోంది. కాని నాకు వినబడడం లేదు.

ఓ గ్లాసు నీళ్ళు ముఖాన కొట్టి, మరో గ్లాసు నీళ్ళు తాగేందు కిచ్చింది.

నేను నేల మీద కూర్చుని వున్నాను.

"మీరు అంతా ముగిసిపోయిన తరవాత వచ్చారు. నేను కొత్త జీవితంలో ప్రవేశించాను. యిదివరకెప్పుడూ నన్ను ప్రేమిస్తున్నట్టు మీరు చెప్పలేదు. యిక వెళ్ళండి"

ఆమె వెళ్ళమని అజ్ఞాపించుతున్నట్టు కనబడింది.

నేను చేయవలసిన పని ఏదో ఒకటి వున్నదని నాకు గుర్తు వుంది. కాని అది ఏదో మర్చి పోయాను. యిక అక్కడ నుండి ఆలోచించేందుకు అవకాశం లేదు.

తరవాత ఆలోచించుకోవలసిందే !

తిరిగి రోడ్డు మీది కొచ్చి, ఆ మరిచిపోయిన దాని కోసం మెదడును శోధించాను.

గుర్తుకొచ్చింది! మామయ్యకు విజయాన్ని చేకూర్చిన కత్తి!

అప్పుడు తిరిగి పార్వతి దగ్గిరకు వెళ్ళి కార్యక్రమానికి వుపక్రమించడం అంటే – చాలా అసం దర్భంగా వుంటుంది. మళ్ళీ హఠాత్తుగా ఆమె కంటబడి, ఎక్కువ మాటలు పెట్టుకోకుండా, కత్తిని జాగర్తగా వుపయోగించాలి. బొడ్డులో దాచి వుంచిన కత్తి కదిలినట్టయింది. మామయ్య ఆత్మ అందులో ప్రవేశించలేదు గదా?

ఇక తక్కిన కార్యక్రమం వాయువేగ మనోవేగాలతో నడిచింది.

ఎదురుగా వున్న జాతీయ క్షౌరశాలలో తల నున్నగా గొరిగించి వేశాను. చొక్కా తీసి రోడ్డు పక్కన పారవేసి – మసక చీకటి పడేవరకు ఆశ్రమం చుట్టూ తిరుగుతూనే వున్నాను. ఒంటరిగా అత్త కండ్ల పడదలచుకోలేదు.

బాగా చీకటి పడగానే – తిరిగి విషయానంద స్వాములవారిని సమీపించాను. యింకా ఆయన ధ్యానంలోనే వున్నాడు. నేను యిచ్చిన కొబ్బరికాయా, చక్రకేళీలు మాత్రం అక్కడ లేవు. ఎందుకో నిజంగానే ఏడుపు వచ్చింది. నిస్సంశయంగా ఆయన పాదాలు పట్టుకుని, "రక్షించు స్వామి!" అన్నాను.

"ఎవరు నువ్వు?"

"ఉదయం కొబ్బరికాయ, చక్రకేళీలు మీకు ప్రసాదంగా సమర్పించుకున్నది నేనే. ప్రపంచం మీద విరక్తి పుట్టింది"

"నిజంగానా"

"నిజం స్వామీ! నిజం! జట్టు కూడా తీయించేశాను"

ఆయన నా వంక ఓ నిమిషం చూసి, "లోపలికి పో! యీశ్వరుడు నిన్ను రక్షించుగాక!" అన్నాడు.

'మామయ్య ఆత్మ సహాయం చేయుగాక!' అనుకుంటూ నేను తిరిగి ఆ వూరిపాకలో ప్రవేశిం చాను.

కాని పార్వతి అక్కడ లేదు. ఎక్కడికి వెళ్ళి ఉంటుంది?

వట్టి నేలమీద బోర్లా పడుకున్నాను. మనస్సును యిష్టం వచ్చినట్టు గంతులు వేయనీయదలచు కోలేదు. బహుశా పార్వతి భోజనానికి వెళ్ళి వుంటుంది. ఆమె తిరిగి రాగానే ఎక్కువ మాటలు

పెట్టుకోకుండా, సూటిగా...జాగర్తగా....

ఆ మాటల్నే తిరిగి తిరిగి మననం చేస్తూ, అలా ఎంతసేపు పడుకున్నానో నాకు తెలీదు.

భుజాన్ని వెచ్చగా ఏదో తాకినప్పుడు, మెడ పక్కకు తిప్పి చూశాను.

పార్వతి!

"మళ్ళీ ఎందుకు వచ్చారు? వెళ్ళిపోండి" – చీకటిలో ఆమె ముఖం నాకు కనబపడడం లేదు.

"పోను! నువ్వు లేకుండా నేను బతకలేను. నీ ప్రేమ కోసం...."

బొడ్లో కత్తి కోసం వెతికాను! కొంచెం వెలుగు వున్నట్టయితే ఎంత బావుండేది! నా దగ్గిర కత్తి వుందనీ, పొడుచుకునేందుకు తయారవుతున్నాననీ, ఆమె చూడకపోతే నిజంగా నేను పొడుచుకు చావవలసి వస్తుందేమో!

"తలుపు తియ్యి ఓ వస్తువు పోయింది. చూడాలి"

ఆమె తలుపు తీస్తూ, "ఏం పోయింది?" అంటూ నా దగ్గిరకు వచ్చింది.

ఆ మసక వెలుగులో అంతకు ముందే పక్కన పెట్టి వుంచిన కత్తిని ఆమె గమనిస్తోందని దృఢపడగానే చేతిలోకి తీసుకున్నాను.

ఆమె కెవ్వున కేక వేసి నా మీద పడింది.

"వద్దు ఆ కత్తి అవతల పారెయ్! నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నాను! నువ్వు లేకుండా నేను ఎలా బతగ్గలను? నువ్వు చెప్పినట్టు చేస్తాను"

నన్ను తన చేతుల్తో కాళ్ళతో నలిపి వేస్తోంది. నేను వుక్కిరిబిక్కిరయాను.

"అయితే పద. యింటికెళదాం!"

పార్వతి చెయ్యి పట్టుకుని నన్ను లేవదీసింది.

"ఇంత ప్రేమ వున్నవాడివి రెండు సంవత్సరాల నుంచీ ఆ మాట నాతో ఎందుకనలేదు?"

మీసం మెలిమేసి నున్నని తలను చేత్తో సరిదిద్దుకున్నాను.

"నీతో చెప్పడానికి భయపడ్డాను. కనీసం నువ్వయినా ఎందుకు చొరవ తీసుకోలేదు?"

పార్వతి కాలి బొటన వేలుతో నేలను రాస్తూ అన్నది. ""అసలు మీకు నా మీద ప్రేమ వున్నదో లేదో అనేది తేల్చుకునేందుకు నేను యింత సాహసానికి వడికట్టాను" – పమిటచెంగును బాగా కళ్ల మీదికి లాక్కుంది.

"ఆ అనుమానం నీకెందుకు కలిగింది?"

"అంతా చెప్పాలంటే చాలా వుంది. కాని మీరు తిరిగి రాజమండ్రి పోయే రోజున నన్ను ఒక ప్రశ్న వేశారు. దానితో నాకు జీవితం మీద నిరాశ పుట్టింది"

"ఏమని?"

నాకు అంతా అయోమయంగా వుంది.

"మీరు బాగా వుందని మెచ్చుకుంటే వినాలనే కుతూహలం కొద్దీ, మీ యింటి కెప్పుడొచ్చినా, నేను బాగా అందమైంది అనుకునే ఆ లేత గులాబీ చీర కట్టుకొచ్చేదాన్ని. ఆ చీర కట్టుకుని

బహుశా మీ ముందు యిరవై సార్లయినా అంతకు ముందు తిరిగి వుంటాను. కాని మీరు రాజమండ్రి వెళ్ళే రోజున 'యిది ఎప్పుడు కొన్నావు?' అని అడిగారు. అప్పుడు మిమ్మల్ని గురించి నేను ఏమనుకోవాలి? నామీద ప్రేమ కాదుకదా - కనీసం నా వంక కూడా మీరు సరిగా చూడడం లేదని అర్థమైంది"

పార్వతి నిరాశకూ నిస్పృహకూ కారణం నా కర్థమైంది. ఆమెను ఎప్పుడైనా ధైర్యంగా కళ్ళల్లోకి చూస్తూ ఏదైనా ప్రశ్న వేయగలిగానంటే అది యిదే! ఆమె కట్టుకున్న చీరల్నీ, పెట్టుకునే రిస్టువాచీనీ, మెడలో ఉండే గొలుసునీ - ఆఖరికి తొడుక్కునే చెప్పుల్నీ కూడా నేను వేయి కళ్ళతో గమనిస్తున్నాననేది ఆ విధంగా....ఆమె అంటే నేను ఎంతగా హృదయం యిచ్చి ప్రేమిస్తున్నానో, తెలియబరచేందుకు ఆ ప్రశ్న వేశాను. తరవాత ఆ ప్రశ్న ఆమెను అడగ్గలిగిన నా ధైర్యానికీ, వూహించగలిగిన బుద్ధి బలానికీ ఎంతో గర్వించాను. కాని తీరా ఆ ప్రశ్నే ఆమె ప్రస్తుత స్థితికీ, నా బాధకీ కారణం అయినట్టు కనబడింది. పశుపక్ష్యాదుల్లాగా, మనిషి కూడా మాటల ద్వారా కాక, సౌంజ్ఞల ద్వారా, అరుపుల వల్ల భావాలని తెలియచెప్పే స్థితిలో వుంటే, ఎన్ని తప్పుగా అర్థాలు చేసుకోవడాలు, అందువల్ల కలిగే ఆశా భంగాలూ, ఆత్మహత్యలూ తప్పేవి!

"ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నారు" - పార్వతి దగ్గిరగా అనుకుంటూ ప్రశ్నించింది.

"ఏమీలేదు"

యింకా దగ్గిరగా తీసుకునేందుకు, నా హృదయంలో హృదయాన్నీ, శరీరంలో శరీరాన్నీ ఐక్యం చేసుకునేందుకు ప్రయత్నం చేశాను.

"యిక్కడ కాదు"

ఆమె నా నుంచి కొంచెం ఎడంగా పోయి చేయిపట్టుకున్నది.

"ఎక్కడ?"

పార్వతి నాకు జవాబు యివ్వకుండా వాకిలి దాటించి, బయట పండువెన్నెల్లోకి నడుపుతోంది. ఆమె హృదయం నాదై వుంటే, ఆ హస్తం అలాగే జీవితాంతం వరకు అవలంబనంగా వుంటే, ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కగలను. సప్త సముద్రాలు కాదు - అష్ట సముద్రాలైనా యీదగలను.

"తిరిగి ఏదో ఆలోచనలో పడ్డారు"

"అనుభవించడానికి తప్ప ఇక ఆలోచించేందుకు ఏమీలేదు. ఇక్కడే పార్వతీ - ఇక్కడే"

ఆమె నన్ను వారిస్తూ' "ఆపైన" అంటూ తల వూపింది.

ఆపైన ఎక్కడ? మబ్బుల వెనకా? చుక్కల చాటునా? లేక చంద్రబింబంలో ముదిమది తప్పి, విసుగూ, విరామం లేకుండా రాట్నం తిప్పుతున్న ఆ ముసలిదాన్ని కిందకు తోసేసి ఆ స్థానం ఆక్రమించేందుకా? ఏమో!

పార్వతి దారి తీస్తోంది. నేను అనుసరిస్తున్నాను....

❋

*(అభిసారిక మాసపత్రిక : అక్టోబరు, 1949)*